క్లుప్తంగా

కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం



తాడేపల్లి రూరల్ : మోటూరు ఉదయం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. కుంచనపల్లి అరవింద హైస్కూల్ ప్రిన్సిపల్ బి. ఇంద్రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు దొంతిరెడ్డి విజయలక్ష్మి మాట్లాడుతూ కంప్యూటర్ విద్య ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని చెప్పారు. తక్కువ ఫీజుతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి దొంతిరెడ్డి విజయలక్ష్మి, నాయకులు మన్నెం లీలమ్మ, చింతా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణ చర్యలపై కరపత్రం ఆవిష్కరణ



తాడేపల్లి రూరల్ : వర్షాకాలంలో వచ్చే వ్యాధులు – నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దుగ్గిరాల గ్రామంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుందని, దీని కారణంగా బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ , దోమలు వృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రోగ నిరోధక శక్తి కూడా కొంత తగ్గి శరీరం బలహీన పడుతుందని పేర్కొన్నారు. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించడం కోసం ఈ కరపత్రాన్ని విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో దోస్త్ స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కుర్రా నాగయ్య, కొండపనేని రవి, గోపి, రావు గోపాలరావు, గండు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహిత తాడేపల్లికి కృషి చేద్దాం

తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు



తాడేపల్లి రూరల్: గంజాయి రహిత తాడేపల్లిగా చేయాలన్నదే తమ ధ్యేయమని, తమకు అందరూ సహరించాలని తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు అన్నారు. ఆదివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌రాజు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. వాటి వినియోగంతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. గంజాయి రహిత తాడేపల్లిగా చేయాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. గంజాయికి బానిసలుగా మారి యువత తమ తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని తెలిపారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలను విక్రయించే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఇరువురికి గాయాలు



గాయపడిన దేవదానం

మేడికొండూరు: రోడ్డుపై ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాలను ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. నరసరావుపేట నుంచి ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో ఆదివారం గుంటూరు వైపు వెళుతోంది. మార్గమధ్యలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాలను అదుపుతప్పి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో డోకిపర్రు గ్రామానికి చెందిన కొల్లారి దేవదానం, ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన పూల వ్యాపారి షేక్ సుభానిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీగా జోజి

ఫిరంగిపురం: జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీగా గ్రామానికి చెందిన నారపోగు జోజి నియమితులయ్యారు. కౌన్సిల్ అధ్యక్షుడు బి.రాజారావు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు జోజి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల పరిరక్షణ కోసం పాటు పడతానని చెప్పారు. జోజికి పలువురు అభినందనలు తెలిపారు.

సందుల్లోనూ గొలుసు దొంగల హల్‌చల్

- ఉండవల్లిలో చైన్ స్నాచింగ్
- ప్రధాన దారులను దాటొస్తున్న స్నాచర్లు





బాధితురాలు భారతి

తాడేపల్లి రూరల్ : గత కొంత కాలంగా సైలెంట్‌గా ఉన్న చైన్ స్నాచర్లు రూట్ మార్చారు. ప్రధాన రహదారుల నుంచి సందులు గొందుల్లోకి వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. తాజాగా ఉండవల్లిలోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో ఆదివారం రాత్రి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం తక్కెళ్లపాటి భారతి అనే వృద్ధురాలు తన కుమార్తె ఇంటికి వెళ్లి పాలు తీసుకుని తిరిగి వస్తున్నారు. ఎదురుగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న నాలుగున్నర కాసుల విలువ గల బంగారపు నానుతాడును తెంపుకుని ఉండవల్లి కొండవైపు రహదారిలో పారిపోయారు. భారతి అరవడంతో కొందరు యువకులు ద్విచక్రవాహనంపై దుండగులను వెంబడించారు.

నిందితులు రెడ్ల రామమందిరం నుంచి నాయుళ్ల రామమందిరం మీదుగా ఉండవల్లి అమరావతి రోడ్డు ఎక్కారని, అక్కడి నుంచి కొండవీటివాగు మీదుగా పెద్దడొంకలో అప్పారావు చెక్‌పోస్ట్ వద్ద అమరావతి ప్రకాశం బ్యారేజ్ కరకట్ట ఎక్కినట్లు గుర్తించారు. మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం వరకు వెళ్లి అక్కడ దిగి ముళ్ల పొదల్లోకి వెళ్లిపోయారని తెలిసింది. అక్కడ వరకు స్థానికులు వారిని వెంబడించారు. దొంగలు గ్లామర్ రెడ్ కలర్ వాహనం వినియోగించారని తెలిపారు. బాధితురాలు దీనిపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలో మూడు రోజుల్లో మూడు చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో జరిగిన చైన్ స్నాచింగ్‌లకు భిన్నంగా ఇది జరగడం విశేషం. గతంలో జాతీయ రహదారి వెంబడి, ప్రధాన రహదారులపై ఈ స్నాచింగ్‌లు జరిగేవి. ఇప్పుడు సందులు గొందుల్లోకి వచ్చి గొలుసులు తెంచుకెళుతుండటంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఉండవల్లిలో జరిగిన చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ ఇద్దరు యువకులు వీవీఐపీలు ప్రయాణించే రహదారిలోకి వెళ్లి తప్పించుకున్నారు. ఈ రహదారిలో 500 మీటర్లకు ఒక చోట కెమెరాలు ఉన్నాయి. పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తే చైన్ స్నాచర్లు దొరికే అవకాశముందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఉద్యోగం, సెల్‌ఫోన్ పేరిట మోసం

- రాత్రికి రాత్రే ఇల్లు ఖాళీ చేసి పరారీ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



నిందితుడు మణి (ఫైల్)

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో ఇద్దరు యువకుల్ని ఉద్యోగం, సెల్‌ఫోను ఇస్తానని మోసం చేసిన వ్యక్తి పరారైన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితులైన భాను, సాయితేజ తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లి మర్రిచెట్టు సమీపంలోని ఓ ఇంటికి నల్లపాటి మణి, శ్రావణ్ దంపతులు 5 నెలల క్రితం అద్దెకు వచ్చారు. స్థానికులతో పరిచయాలు పెంచుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన భానుకు సచివాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. రూ. 50 వేలు ఖర్చు అవుతుందని చెప్పి, రూ.30 వేలు తీసుకున్నారు. రెండు రోజుల క్రితం అదే ప్రాంతంలో నివసిస్తున్న సాయితేజకు రూ.10 వేలకు సెల్‌ఫోన్ ఇస్తానని డబ్బులు తీసుకున్నారు. వారం రోజులుగా అదృశ్యమయ్యారు. శనివారం మణి వేషధారణ మార్చి, కనుబొమ్మలు తీసి ఇంటికి వచ్చినట్లు తెలుసుకున్న బాధితులు వెళ్లి నిలదీశారు. ఆదివారం ఉదయం డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని మణి పేర్కొన్నాడు. రాత్రికి రాత్రే భార్యాభర్తలు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని, జరిగిన ఈ సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు భాను, సాయితేజ తెలిపారు.

స్థానిక భవన నిర్మాణ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

తాడేపల్లి రూరల్: రాజధాని నిర్మాణంలో స్థానిక భవన నిర్మాణ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. దుగ్గిరాలలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 5,900 క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాసరావు, నూతన అధ్యక్షులుగా బి. రామారావు, కార్యదర్శిగా పులివర్తి రాజేష్, ఉపాధ్యక్షులుగా ఎల్లమాటి ఏసోబు, ఎస్‌కే అన్వర్ బాషా, సహాయ కార్యదర్శులుగా గంగాధర్, కోడూరు రాజశేఖర్, కోశాధికారిగా హనుమాన్‌లను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో విద్యా సరస్వతి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో తొమ్మిదోవ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రెండో రోజుకి చేరాయి. ఎంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్, ఆలయ కమిటీ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నిత్య పూజలు, విద్యా సరస్వతి, నవగ్రహాలు, మాలికా పురోత్తమ అమ్మలకు విశేష అభిషేకాల్ని ఆలయ అర్చకులు కె.శివకుమారశర్మ, కె.చంద్రశేఖరశర్మ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అనంతం వారికి తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం విద్యా సరస్వతి హోమం నిర్వహించారు. చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 24న ఉదయం శ్రీరామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమాలు, నవగ్రహ హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నగరంపాలెం:స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అగ్ని ధ్యానం, నవగ్రహారాధన, శ్రీ వెంకటేశ్వర మూలమంత్ర హోమం తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో పురవీధుల్లో శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామప్రసాద్ రథోత్సవాన్ని ప్రారంభించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బాల ముకుంద కోలాట బృందం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకటమల్లేశ్వర్, ఉపాధ్యక్షులు పావులూరి కిశోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

నగరంపాలెం: కృష్ణనగర్ ఒకటో వీధిలోని శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్ష కంకణధారణ, అంకురారోపణ, హోమం తదితర పూజల్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీ ధనకుదరం శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ఈనెల 26 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

విద్యార్థినులకు నీట్‌పై ఉచిత అవగాహన తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ స్థాయిలో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికై వచ్చే ఏడాది జరగనున్న నీట్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థినులకు మూడు రోజుల పాటు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్‌లోని దోమలగూడకు చెందిన మెటామైండ్ అకాడమీ చైర్మన్ ఏ. మనోజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికోలు, సీనియర్ అధ్యాపకులు సమగ్ర అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతితో నిర్వహించనున్న తరగతులకు పేర్ల నమోదుకు 89199 26339 లో సంప్రదించాలని సూచించారు.

టిఫిన్ తిని సెల్‌ఫోన్ దోపిడీ

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడు శివాలయం సమీపంలో ఓ టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి చిన్నారి నుంచి సెల్‌ఫోన్ లాక్కుని ఆదివారం పరారయ్యాడు. బాధితురాలు ముద్ర విజయ తెలిపిన వివరాల ప్రకారం.. పోలకంపాడు శివాలయం వద్ద టిఫిన్ బండి పెట్టుకుని ముద్ర జీవనం కొనసాగిస్తున్నారు. ఉదయం 7.30 గంటల సమయంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి టిఫిన్ చేశాడు. తన మనవడు ఆడుకుంటున్న సెల్‌ఫోన్ లాక్కుని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. అతడి కోసం నంబూరు వరకు వెంబడించినా ప్రయోజనం దక్కలేదని వాపోయారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) ఆధ్వర్యంలో దివ్యాంగులైన విద్యార్థులతోపాటు ప్రతిభావంతులైన ఇతర విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. శ్యామలానగర్‌లోని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు నివాసంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 15 మంది విద్యార్థులకు మూడు వేల రూపాయల చొప్పున అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వైకల్యం శరీరానికే తప్పా ప్రతిభకు కాదని, దివ్యాంగ విద్యార్థులు అందరితో సమానంగా చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సన్ నిర్వాహకులు యశ్వంత్, సాయి, ఆకాష్ పాల్గొన్నారు.

పచ్చ కర్పూరం అలంకారంలో గోవిందుడు



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆదివారం స్వామికి పచ్చ కర్పూరంతో అలంకారం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలతో అష్టోర కలశ స్నపన, అభిషేకాలు, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ చేపట్టారు. చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ, ప్రసాదాల్ని అందజేశారు. శ్రీ జగన్నాథ, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల ఉన్నతికి రామ్మూర్తి కృషి



నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణుల్ని బీసీల్లో చేర్చేందుకు గానాల రామ్మూర్తి ఎంతగానో కృషి చేశారని గుంటూరు పట్టణ సంఘం అధ్యక్షులు కడియాల సుబ్బారావు పేర్కొన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రామ్మూర్తిని ఆదర్శంగా తీసుకుని సంఘ పురోభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఉచిత వైద్య సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మేడపి వెంకట ప్రసాద్, మేడూరి శివరామకృష్ణ, పుసపాటి శేషగిరిరావు, ఒంగోలు హనుమంతురావు పాల్గొన్నారు.

పెదపాలెం సర్పంచ్ రాజీనామా

- గ్రామాభివృద్ధిలో అగ్రవర్ణాల జోక్యం
- కుంటుపడిన ప్రగతి
- ఆవేదన వ్యక్తం చేసిన సర్పంచ్ శివపార్వతి



ఎంపీడీవోకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న శివపార్వతి

పొన్నూరు : రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోయిన నేపథ్యంలో ఇక గ్రామాభివృద్ధి కష్టమని భావించి మండలంలోని పెదపాలెం గ్రామ సర్పంచ్, బీసీ వర్గానికి చెందిన వల్లభాపురపు శివపార్వతి తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రత్నజ్యోతికి తన రాజీనామా పత్రాన్ని అందజేసి ఆమోదించాలని కోరారు. ఈ సందర్భంగా శివపార్వతి మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన తాను గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని తెలిపారు. అగ్రవర్ణాలకు చెందిన నాయకులు కొందరు వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే నాటకీయంగా టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామాభివృద్ధిని కుంటుపరిచారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీ కండువా తీసి మళ్లీ టీడీపీలో చేరారని, ఆ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ వారి అక్రమాల పరంపర కొనసాగనుందని తెలిపారు. అగ్రవర్ణాల ఆధిపత్యంలో బీసీనైన తనకు గ్రామ ప్రజలకు సేవ చేసే అవకాశం ఇకపై ఉండదని గ్రహించి రాజీనామా చేసినట్లు శివపార్వతి తెలిపారు.

సేంద్రియ సాగు మరింత పెరగాలి

వ్యవసాయ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కె రామచంద్రం

గుంటూరు రూరల్: నేలలో తగిన మోతాదులో సేంద్రియ పదార్థం ఉంటే ఎంతో మేలని వ్యవసాయ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కే రామచంద్రం తెలిపారు. సేంద్రియ సాగు వైపు రైతులు నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉపయోగించే రసాయనాల వల్ల నేలలో ఉండే సూక్ష్మజీవులు నశించిపోతున్నాయని చెప్పారు. ఈ సమస్యకు పరిష్కారం సేంద్రియ వ్యవసాయం చేయటమే అన్నారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై శిక్షణ సంతోషకర విషయమన్నారు. తిరిగి పంటల సాగుతోపాటు పశుపోషణ, కోళ్ల పెంపకం వంటివి చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా గోశాల, కట్టెగానుగతో నూనె తీసే ప్రక్రియ, వానపాముల ఎరువు, ఘనజీవామృతం తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. రాబోయే రెండు రోజులలో తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం, బిస్కెట్లు, టమాట సాసు తయారీ విధానం, చిరు ధాన్యాలతో వంటకాలు వంటి వాటిని ప్రత్యక్షంగా చూపించనున్నారు. రైతుల పంటలకు విలువ జోడింపుపైనా అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో వీఏఎస్ డాక్టర్ రాంబాబు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



తాడేపల్లిలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు టంకసాల ఈశ్వర్ నాయుడు తదితరులు



దుగ్గిరాలలో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు పసుపులేటి గణేష్ తదితరులు

తాడేపల్లి రూరల్ : ప్రముఖ జాతీయవాద నేత, భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం దుగ్గిరాల, ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో ఘనంగా నివాళులు అర్పించారు.

తాడేపల్లిలో....

తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట, మహానాడులో బీజేపీ పట్టణ అధ్యక్షులు టంకసాల ఈశ్వర్ నాయుడు (ఏసుబాబు) ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ అందరూ సమానమేనని, అందరికీ ఒకే రాజ్యాంగం, ఒకే దేశం, ఒకే ప్రధానమంత్రి ఉండాలని అప్పట్లోనే శ్యాంప్రసాద్ ముఖర్జీ నినదించారని గుర్తుచేశారు. జైలులో అనుమానాదాస్పద పరిస్థితిలో మరణించారని అన్నారు. ఆర్టికల్ 370 రద్దును ఆనాడే డిమాండ్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి బీజేపీ ఉపాధ్యక్షులు గట్ల శివకొండారెడ్డి, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దూపుగుంట్ల వెంకట నాగ సురేష్ కుమార్, పట్టణ కోశాధికారి వల్లూరు శివరామకృష్ణ, యువమోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వల్లభాపు రావుగిరి, బత్తుల ఆంజనేయులు, కర్రి అచ్చయ్య, సాయి, పి. నారాయణ, ఎస్. అశోక్, ఎస్. వెంకటపతి, సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య, శ్రీరాములు రెడ్డి, గురవయ్య, అంకమ్మ, ఉదయలక్ష్మి, రమణ, కేశవ, పాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో....

దుగ్గిరాల మండల బీజేపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు పసుపులేటి గణేష్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. అనంతరం గణేష్ మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు ఉమామహేశ్వరరావు, సుంకర జోగేందర్, తాడిబోయిన శ్రీధర్‌బాబు, కోనంకి కృష్ణ, తుమ్మపూడి అంకరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్వినియోగమవుతున్న పౌర స్మృతులు

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్

నగరంపాలెం: పలు పౌర స్మృతులు (సివిల్ కోడ్‌లు) ఎక్కువగా దుర్వినియోగం అవుతున్నాయని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు.

సమాలోచన (మేధావుల వేదిక) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల ఆఫ్ ఫార్మసీ హాలులో ఆదివారం 'కామన్ సివిల్ కోడ్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య, గౌరవ అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, సదస్సు ప్రారంభించారు. శ్రీమేధ విద్యా సంస్థల డైరక్టర్ అన్నా నందకిశోర్ అధ్యక్షత వహించారు. ఉమ్మడి పౌరస్మృతి అవశ్యకత, పూర్వ రంగాన్ని ఆయన ప్రస్తావించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ దుర్వినియోగమవుతున్న పౌర స్మృతుల్ని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గౌరవ అతిథి, తులసి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ తులసి యోగీశ్‌చంద్ర మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతి(కామన్ సివిల్ కోడ్)ని అమలు చేయడం ద్వారా భావాత్మక ఏకత సాధించవచ్చని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతి మత సంబంధాల్లో ఎందుకు జోక్యం చేసుకోదు.. ఏ విషయాలకు పరిమితమవుతుందనే అంశాలపై రాక లోకం చీఫ్ ఎడిటర్ రాక సుధాకరరావు వివరించారు. ఉమ్మడి పౌరస్మృతితో మహిళా సాధికారత, న్యాయమైన వారసత్వ, వివాహ, హక్కుల సార్వజనీనత ఎలా వస్తాయనేది తెలియజేశారు. సమాజానికి మేధోపరమైన నాయకత్వం అందించే వారు ఉమ్మడి పౌరస్మృతి కోసం పాటుపడాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సదస్సులో మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రముఖ నాయకులు, న్యాయవాదులు జూపూడి రంగరాజు, బ్రహ్మానందరెడ్డి, కిడాంబి దేవరాజన్, జి.ఎస్.పి. ముఖర్జీ ప్రసంగించారు. చివరగా లక్ష్మణ్ దేశభక్తి గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మన్నవ బాలచంద్ర, కృష్ణమోహన్ పాల్గొన్నారు.